క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



నెలివాడలో ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

బొండపల్లి: హిందూ ప్రచార ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని నెలివాడ, కెరటాం, బిల్లలవలస గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం ఇంటింట ప్రచారం నిర్వ హించారు. ప్రబోధ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు శంకరరావు మాట్లాడుతూ సృష్టికి మూలం, వాటి రహస్యాలు త్రైత సిద్ధాంతంలో ఉన్నా యన్నారు. ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటూ, వారికి సహాయపడడం, సేవలు అందించడం ద్వారానే ముక్తిమార్గం పొందవచ్చని చెప్పారు. ప్రబోధ సేవా సమితి సభ్యులు సి.వి.ఎస్.నాయుడు, శ్రీను,లోకేష్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు

గజపతినగరం: నూతన సంవత్సరంలో తొలిరోజును పురస్కరించుకుని మండల కేంద్రంలో ఆలయాలకు భక్తులు సోమవారం క్యూకట్టారు. స్థానిక ఉమారామలింగేశ్వర స్వామి, వేంకటేశ్వరస్వామి, సీతారా ముల ఆలయాల్లో అర్చకులు భక్తులతో ప్రత్యేక పూజలు,అభిషేకాలు చేయించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



విజేతలకు షీల్డ్స్ అందజేస్తున్న ఎస్ఎంఎస్ పరిశ్రమ డైరెక్టర్ గోపి

చీపురుపల్లిరూరల్(గరివిడి): క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎస్ఎంఎస్ ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ డైరెక్టర్ వాకాడ గోపి అన్నారు. గరివిడి పట్టణంలోని రామేశ్వరి కాలనీకి చెందిన యువకుడు సుధీర్ జ్ఞాపకార్థం సోమవారం షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీల్లో ప్రథ మ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.రిఫరీలుగా కోరాడ వేణు,ప్రేమ్‌కుమార్‌సింగ్ వ్యవహరించారు. టోర్నమెంట్ నిర్వాహకులు సునీల్, బుజ్జి, పరుశునాయుడు, సురేష్,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



కొత్తవలస జంక్షన్‌లో ర్యాలీ చేస్తున్న రామ భక్తులు

కొత్తవలస: అయోధ్యలోని రామ జన్మభూమిలో నిర్మించిన రామమందిరంలో ఈనెల 22న బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ చేయనున్న నేపథ్యంలో రామ భక్తులు మండల కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. రామ జన్మభూమి నుంచి తీసుకువచ్చిన అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ రోజున సూర్యాస్తమయం అయిన తర్వాత ఇళ్ల ముందు అంతా దీపాలను వెలిగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రచారకర్తలు కొరుపోలు అప్పారావు, సీహెచ్.అప్పారావు, ఎం.త్రినాథరావు,ఎం.తాత పాల్గొన్నారు.

సాగునీటి కాలువలో తుప్పల తొలగింపు



తోటపల్లి కాలువలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న పెనుబర్తి గ్రామ రైతులు

గుర్ల: మండలంలోని పెనుబర్తి గ్రామం వద్ద తోటపల్లి సాగునీటి కాలువలో తుప్పలను, పూడికను ఆ గ్రామ రైతులు సోమవారం శ్రమదానం చేసి తొలగించారు. రైతులు మాట్లాడుతూ కాలువలో తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో చెరువులకు సాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. ప్రస్తుతం మొక్కజొన్న పంటకు నీరు అవసరమని, తోటపల్లి కాలువలో ప్రవహిస్తున్న నీటితో గ్రామంలోని చెరువులను నింపేందుకు కాలువలోని తుప్పలు, పూడిక, పిచ్చి మొక్కలను తొలగిస్తున్నామని రైతులు చెప్పారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

కొత్తవలస: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పద్మజ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



గజపతినగరం: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి నాయకులకు తినిపిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం, ఎస్.కోట, చీపురుపల్లి నియోజకవర్గాల్లోని గ్రామాలు, పట్టణాల్లో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ పార్టీల కార్యాలయా ల్లో అధికారులు, నాయకులు కేకులు కట్ చేశారు. గజపతినగరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కేకు కట్ చేశారు. అంతకుముందు స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పూజలు చేశారు. శృంగవరపుకోట వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కేక్ కట్ చేసి, నాయకులతో సంబరాలు చేసుకున్నారు. స్థాక బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వాహకులు ఎమ్మెల్యే శ్రీనివాసరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలకు అధికారులు,ఎంపీటీసీలు, సర్పంచ్‌లు నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

– గజపతినగరం/శృంగవరపుకోట/గంట్యాడ/బొండపల్లి/గుర్ల/దత్తిరాజేరు/వేపాడ/లక్కవరపుకోట/కొత్తవలస



బొండపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో కేకు కట్ చేస్తున్న ఎంపీపీ చలం నాయుడు, జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు



గుర్ల: పాలవలసలో ఎంపీపీ ప్రమీల, సన్యాసినాయుడు దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న వెలుగు సిబ్బంది



గుర్ల: భూపాలపురంలో జెడ్పీటీసీ అప్పలనాయుడుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఉపాధ్యాయులు



దత్తిరాజేరు: పెదమానాపురంలో జెడ్పీటీసీ రాజేశ్వరికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు



దత్తిరాజేరు: మండల పరిషత్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు



వేపాడ: కుమ్మపల్లిలో ఎంపీపీ సత్యవంతుడుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మండల పరిషత్ అధికారులు,సిబ్బంది



లక్కవరపుకోట: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు చెబుతున్న అధికారులు,నాయకులు



గంట్యాడ: రామవరంలో ఎంపీపీ హైమావతికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీడీఓ భవాని, అధికారులు



శృంగవరపుకోట: ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు క్యాలెండర్ అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న బ్రహ్మకుమారీలు



శృంగవరపుకోట: ఎస్.కోట వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



కొత్తవలస: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోపమ్మకు శుభాకాంక్షలు చెబుతున్న అధికారులు, కార్యకర్తలు



లక్కవరపుకోట: జెడ్పీటీసీ వరలక్ష్మికి కొత్తవలస లోని తన నివాసంలో శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వేపాడ: కుమ్మపల్లిలో ఎంపీపీ సత్యవంతుడుకు శుభాకాంక్షలు చెబుతున్న వెలుగు సిబ్బంది



కొత్తవలస: వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, జెడ్పీటీసీ శ్రీదేవికి కొత్తవలసలో శుభాకాంక్షలు చెబుతున్న అధికారులు, నాయకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొండపల్లి: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈఈ ఆర్.శంకరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో వివిధ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో బొండపల్లి, బొడసింగిపేట, కనిమెరక, గిట్టుపల్లి, దేవుపల్లి,జి.పి.అగ్రహారం, సి.టి.కె.పల్లి, రాచకిండాం, చామలవలస గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గజపతిగరం 11 కేవీ ఫీడర్ పరిధిలో..

గజపతినగరం: స్థానిక 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగలకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యా హ్నాం 2గంటల వరకు ఫీడర్ పరిధి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ బొబ్బిలి ఏఈ ఆవాల అనంతరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని పురిటిపెంట న్యూకాలనీ,ఎస్సీ కాలనీ, మామిడిబంద కాలనీ, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, పాత ఎంపీడీఓ ఆఫీస్, జూనియర్ కళాశాల ప్రాంతాలకు, మారుతీనగర్ కాలనీతో పాటు వెంకటాపురం గ్రామానికి విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పదోతరగతి పరీక్షల మోడల్ పేపర్ల ఆవిష్కరణ



మోడల్ పేపర్ల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న వెలమ కార్పొరేషన్ చైర్మన్ నాయుడుబాబు, యూటీఎఫ్ నాయకులు

కొత్తవలస: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి యూటీఎఫ్‌లోని అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు తయారు చేసిన మోడల్ పేపర్ల బుక్‌లెట్‌ను రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు కొత్తవలసలోని తన క్యాంపు ఆఫీస్‌లో సోమవారం ఆవిష్కరించారు. యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు లు సీహెచ్.నిర్మలాదేవి, జి.విజయగౌరి మాట్లాడుతూ విద్యార్థులు అధిక మార్కులు సాధించేందుకు ఈ మోడల్ పేపర్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఈ మోడల్ పేపర్లు అందజేస్తామన్నారు. ఉపాధ్యాయులను నాయుడుబాబు అభినందించారు. జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, నాయకులు మేలాస్త్రి అప్పారావు, యూటీఎఫ్ నాయకులు వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

• వేపాడలో శౌర్య దివస్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దళిత నేతలు

వేపాడ: మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత నేత దేబార్కి కిరణ్ ఆధ్వర్యంలో సోమవారం శౌర్యదివస్ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి దళిత నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బానిసత్వ సంకెళ్లు తెంచుకోవాలని పీష్వా బ్రాహ్మణులతో మహారాష్ట్రలోని భీమా కొరేగావ్ వద్ద 1818లో మహార్ పోరాట యోధులు భీకర యుద్ధం చేసి జనవరి1న విజయం సాధించారన్నారు. దీనికి స్ఫూర్తిగా మహారాష్ట్రలోని భీమా కొరేగావ్ వద్ద నిర్మించిన స్మారక స్థూపాన్ని అంబేడ్కర్ సందర్శించి, దానిని దళితుల ఆత్మగౌరవ చిహ్నంగా పేర్కొన్నారన్నారు. నాటి నుంచి ప్రతీ ఏడాది జనవరి 1న దళితులు ఆ స్థూపాన్ని సందర్శించడం ప్రారంభమైందన్నారు. అలాగే నాటి యుద్ధంలో అమరులైన వారిని జనవరి 1న స్మరించుకుంటూ నివాళులర్పిస్తూ శౌర్యదివస్ నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. దళిత నేతలు, స్థానికులు బి.అప్పారావు, బంగారయ్య, ఈశ్వరరావు, సుధాకర్, నరేంద్ర, చత్రపతి, మరియదాసు, ఆంజనేయులు, సత్యారావు పాల్గొన్నారు.

వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ షెడ్యూల్ ఖరారు

చీపురుపల్లి: వైఎస్సార్ పెన్షన్ కానుక పథకంలో భాగంగా పెంచిన పింఛన్ డబ్బుల లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూల్ ఖరారయ్యింది. జనవరి నెల నుంచి ఫించన్ డబ్బులను రూ.3 వేలకు పెంచనున్నట్లు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. నియోజకవర్గంలో ఈనెల 4న మెరకముడిదాం మండలంలోను, 5న చీపురుపల్లి, 6న గరివిడి, 8న గుర్ల మండలాల్లో పింఛన్ నగదు పంపిణీ కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమాలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అతిథులుగా హాజరుకానున్నారు.

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష 2.0

చీపురుపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 షెడ్యూల్ ఖరారయ్యిందని ఇన్‌చార్జి ఎంపీడీఓ జి.గిరిబాల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 2 నుంచి మే 7 వరకు ప్రతీ వారం సచివాలయాల వారీగా జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 2న మండలంలోని రామలింగాపురం, 9న రావివలస, 23న మెట్టపల్లి, 30న గొల్లలపాలెం సచివాలయా ల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఫిబ్రవరి 6న కరకాం, 13న ఇటకర్లపల్లి, 20న నిమ్మలవలస సచివాలయాల్లో, మార్చి 5న పర్ల, 12న పి.కె.పాలవలస, 19న అలజంగి, 26న పెదనడిపల్లి సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఏప్రిల్ 2న పేరిపి, 8న జి.అగ్రహారం, 16న చీపురుపల్లి, 23న వంగపల్లిపేట, 30న విజయకాలనీ, మే 7న చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులకు నగదు అందజేస్తున్న గురుస్వామి శ్రీరామశర్మ

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయానికి అయ్యప్పల గురుస్వామి చిట్టూరు శ్రీరామశర్మ రూ.1,00,311 విరాళం ఇచ్చా రు. స్థానిక ఉమానీలకంఠే శ్వరస్వామి దేవస్థానంలో ఆలయ నిర్మాణ ట్రస్టు బోర్డు సభ్యు లు అప్పికొండ ఆదిబాబు, గంట్యాడ విష్ణుమూర్తి, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, దాసరి రవి శంకర్, దిలీప్‌కుమార్ ధనూకాలకు సోమవారం నగదు అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ తన మిత్రుడు కల్లికాటిల్ ప్రభాకరణ్ నాయర్ జ్ఞాపకార్థం ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేసినట్లు చెప్పారు. కల్లికాటిల్ సుందర్, వెంకటేష్, గురుస్వాములు గొర్లె ఆనందరావు, కృష్ణ, లోలుగు రామచంద్రరావు, గవిడి నాగరాజు, రెడ్డి లక్ష్మణ, పాండ్రంకి గణ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



వేపాడ: నీలకంఠరాజపురంలో డీసీసీబీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, అధికారులు



వేపాడ: వేపాడలో విశాఖ పాల ఉత్పత్తిదారుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆ సంఘం అధ్యక్షుడు దేముడుబాబు



గజపతినగరం: కార్పెంటర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ తవుడు, తదితరులు



గజపతినగరం: యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు విమలమ్మ,సాయిచక్రధర్

వేపాడ: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు 2024 సంవత్సర క్యాలెండర్‌ను మండలంలోని నీలకంఠరాజపురంలో డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు తన నివాసంలో డీసీసీబీ సీఈఓ కె.జనార్ధన్‌తో కలిసి సోమవారం ఆవిష్కరించారు. అలాగే చినరామునాయుడు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. మండల నాయకు లు, అధికారులు చినరామునాయుడుకు నూతన సంవత్సర, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

పాలఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో..

వేపాడకు చెందిన విశాఖ పాల ఉత్పత్తిదారుల సంఘం క్యాలెండర్‌ను ఆ సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి దేముడుబాబు వేపాడలో సోమవారం ఆవిష్కరించారు. సంఘం డైరెక్టర్లు, పాలఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

గజపతినగరం: ఏపీ కార్పెంటర్స్(వడ్రంగి)అసోసియేషన్ క్యాలెండర్‌ను మండలంలోని పురిటిపెంట గ్రామ సచివాలయం–2లో జెడ్పీటీసీ గార తవుడు, వైస్ సర్పంచ్ మండ ల సురేష్ సోమవారం ఆవిష్కరించారు. ఏపీ కార్పెంటర్స్ అసోసియేషన్ గజపతినగరం శాఖ అధ్యక్షుడు కె.అప్పలాచారి, జిల్లా కన్వీనర్ అండ్లూరి గణేష్, జిల్లా ఉపాధ్యక్షు డు ఎ.జగదీష్, మండల కోశాధికారి సన్యాసిరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత రేగ సురేష్, ఆదాడ గోపి, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

యూటీఎఫ్ నూతన క్యాలెండర్‌ను గజపతినగరం మండల వనరుల కేంద్రంలో ఎంఈఓలు విమలమ్మ,సాయిచక్రధర్ సోమవారం ఆవిష్కరించారు. అంతకుముందు కార్యాలయంలో సిబ్బందితో కలిసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు.మండల యూటీఎఫ్ నాయకులు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.